
తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- రూ. 75 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్
- అవసరమైన చోట మరమ్మతులకు సమాయత్తం


జంగారెడ్డిగూడెం పట్టణం వ్యూ

జంగారెడ్డిగూడెం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలకు సక్రమంగా నీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారు. నీటి ఎద్దడిని నివారించేందుకు యుద్ధ ప్రాతిపదికన అత్యవసర మరమ్మత్తులు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏయే పనులకు ఎంతెంత అవసరమో ప్రణాళికలు వేసి అందుకు అవసరమైన నిధులు సుమారు రూ.75 లక్షల నిధులు ఏర్పాటు చేశారు. వేసవిలో వేడిగాలులు వీచే పరిస్థితులు ఉన్నందున అందుకు తగిన ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. చలివేంద్రాలకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. నీటి నిల్వలను అనుసరించి వేసవి మొత్తం తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందించేంలా కార్యాచరణ రూపొందించారు. పట్టణంలోని 29 వార్డుల్లో మంచినీరు సరఫరా చేసే బోర్ వెల్స్ పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఇలా..

జంగారెడ్డిగూడెం పట్టణంలోని 29 వార్డుల్లో ఎక్కడా ఈ వేసవిలో మంచినీటి కొరత రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అధికారులు రూపొందించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న చోటికి మంచినీటిని ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసేందుకు రూ.2 లక్షలు కేటాయించింది. చేతిపంపులు, బోర్లు మరమ్మతులు, స్పేర్ పార్ట్స్ నిమిత్తం రూ.10 లక్షలు, పాడైన పైప్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం రూ.5 లక్షలు, మోటార్లు, పంప్‌సెట్ల మరమ్మతులకు రూ.10 లక్షలు, ఇతర పనులకు రూ.లక్ష, నిర్వహణ ఖర్చులు నిమిత్తం రూ. లక్ష, బోర్లపూడిక తీత, శుభ్రం చేసే పనులకు రూ.10 లక్షలు, ఇతర ఖర్చులకు రూ.36 ఖర్చులు కేటాయించారు. మొత్తంగా నీటి ఎద్దడిని ఎదుర్కొనేలా రూ.75 లక్షలతో యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

క్లుప్తంగా

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ


ఎంపీడీవో విజయ్‌ప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 3వ తేదీ నుంచి పెన్షన్ల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా పెన్షన్ల పంపిణీ చేస్తారని తెలిపారు. అనారోగ్యంతో లేవలేని పరిస్థితుల్లో ఉన్న వారికి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందిస్తారని, ఎవరూ ఎటువంటి ఇబ్బందులు పడవద్దని సూచించారు. పెన్షన్ల పంపిణీ చేసే సచివాలయాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశాలు చేశామన్నారు. మంచి నీరు, టెంట్లు ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ డిమాండ్ చేశారు. మండలంలోని లంకపాకలలో ఆ సంఘ జనరల్ బాడీ సమావేశం ఉప సర్పంచ్ చింతాల కృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనికి ఎన్‌డీఏ అనుసరిస్తున్న విధానాలే కారణమని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థిగా పోటీ చెయ్యనున్న సరియం రామ్మోహన్‌ను పరిచయం చేశారు. రాబోయే ఎన్నికల్లో రామ్మోహన్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు, నాయకులు టి. బాబూరావు, కె. పోతురెడ్డి, వి. భారతి, పట్ల చిన్నన్న, బి. వినోద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


దెందులూరు హైవే వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు: ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా మంగళవారం దెందులూరు జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వివిధ వాహనాల నంబర్లను నోట్ చేసుకుని కార్లల్లో సోదాలు నిర్వహించారు. దెందులూరు చెక్ పోస్టు, సోమవరప్పాడు, గుండుగొలను హైవే వద్ద తనిఖీలు దెందులూరు తహసీల్దార్ వీ.జి తేంద్ర తనిఖీ చేశారు.

పల్లాలమ్మ ఆలయంలో వాసుబాబు పూజలు


చానమిల్లిలో పల్లాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: చానమిల్లి గ్రామ దేవత పల్లాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బేతు నాని. మాజీ కన్వీనర్ బేతు రాజశేఖర్, సర్పంచ్ నంద్యాల ప్రసాదు, ఉపసర్పంచ్ వెజ్జు నరేష్, పడాల శ్రీశైలం, దాసరి రామకృష్ణ, పార్టీ అధ్యక్షుడు గరికిపాటి సాయిరాం, కురుపూడి గంగరాజు తదితరులున్నారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. స్వామివారికి మంగళవారం ఒక్కరోజు రూ.93,108 ఆదాయం లభించిందని, 800 మంది స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు చెప్పారు. ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు


కాశిపాడు పాఠశాలలో విద్యార్థుల రాత పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఎంఈవో శేషు

గణపవరం: త్వరలో ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడులో ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిలబస్ పూర్తయిందా లేదా అన్నది ఆరా తీశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వార్షిక పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులను పరీక్షించారు. పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పాలన

- సీఎం జగనన్నను మళ్లీ గెలిపించండి
- జొన్నకూటి విజయ్‌కుమార్ ఇంటింటి ప్రచారం


ద్వారకాతిరుమల మండలం తూర్ల లక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్, నాయకులు

ద్వారకాతిరుమల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గడప గడపకూ సంక్షేమ పథకాలను అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత సోదరుడు జొన్నకూటి విజయ్ కుమార్ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన ఐఎస్ రాఘవాపురం, తూర్ల లక్ష్మీపురం గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు తన మ్యానిఫెస్టోలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించారని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మళ్లీ బూటకపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మోసపూరిత హామీలను ఎవరూ నమ్మవద్దన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చి, పేదల జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడారు. విద్య, వైద్య రంగంతో పాటు మహిళా, రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక సీఎం జగనన్న మాత్రమేనని అన్నారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు రాష్ట్రంలో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో మంత్రి తానేటి వనితను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం సర్పంచ్‌లు దాకారపు బంగారమ్మ, పసుపులేటి ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, గుర్రాల లక్ష్మణ్, ఆచంట బన్ను, మటపర్తి పుల్లయ్య, చెలికాని బుల్లియ్య, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, ఆచంట సురేష్, షేక్ భాషా, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, పోల్కంపల్లి అనీల్, దాకారపు అగ్గియ్య, పసుపులేటి సాయిబాబు, దాసరి ఏసురత్నం, అన్నారీ, జంగా వెంకట కృష్ణారెడ్డి తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు దంపతుల పర్యటన

కొయ్యలగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి బుధవారం యర్రంపేట, కుంతలగూడెం పంచాయతీల పరిధిలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పర్యటన ప్రారంభమవుతుంది. కుంతలగూడెం, ఆరిపాటి, తిమ్మనకుంట, ఈవీడిపాలెం, గంగన్నగూడెం, యర్రంపేటలో రాజ్యలక్ష్మి పర్యటిస్తారు.

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

జంగారెడ్డిగూడెం: ఈనెల 3న జంగారెడ్డిగూడెం పట్టణ వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య తెలిపారు. సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్ నివాసంలో మంగళవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆళ్ల కాశీ కృష్ణ శ్రీనివాస్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంభం విజయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాథరావు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మండవల్లి సోంబాబు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవి, నాయకులు మేడవరపు విద్యాసాగర్, ముప్పిడి శ్రీను, బత్తిన చిన్న, గెద్దాడ శ్రీను, చిప్పాడ వెంకన్న, షేక్ జిలాని, సోమేశ్వరరావు, మాకబోయిన మురళి, దోరేపల్లి విజయ్ పాల్గొన్నారు

65 లీటర్ల సారా స్వాధీనం


చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

చింతలపూడి: చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతిబాబు ఈ దాడులకు ఆధ్వర్యంలో వహించారు. నాగిరెడ్డిగూడెం, వేములపల్లి, కళ్ళ చెర్వు, పాత గండిగూడెం గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 3,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 65 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్లు సీఐ డీఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. అనంతరం అల్లి పల్లి చెక్‌పోస్టును ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతిబాబు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి అక్రమ మద్యం రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. దాడుల్లో ఏలూరు డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మద్రి శ్రీనివాసరావు, ఎస్సైలు పి.లక్ష్మణరావు, మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం

ముస్తాబవుతున్న ధ్వజ స్తంభం


కొయ్యలగూడెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించే ధ్వజ స్తంభాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కరుణాపురం రోడ్డులోని ఆలయం వద్ద మూడు, నాలుగు, ఐదు తేదీల్లో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మన్ మంతెన సోమరాజు తెలిపారు. నాలుగవ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం ఏడు గంటల 38 నిమిషాలకు నూతనంగా పునః నిర్మించిన ఆలయంలో శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ అమ్మవారిని అదే విధంగా విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ధ్వజ స్తంభం తుది మెరుగులు దిద్దుకుంటోంది. పాపికొండల అభయారణ్యం నుంచి సేకరించిన సోము చెట్టును ధ్వజస్తంభంగా శిల్పులు తీర్చిదిద్దుతున్నారు.తూర్పుగోదావరి జిల్లా వెంకటాయపాలెం చెందిన ముక్కామల వీరబ్రహ్మం, ముక్కామల హరి మణికంఠ, ఏలూరు జిల్లా బయ్యనగూడెం చెందిన కలవగంటి వీర భద్రాచార్యులు పది రోజుల నుంచి ధ్వజ స్తంభాన్ని రూపు దిద్దుతున్నారు. పడమర వైపు అభిముఖంగా ప్రతిష్ఠించే కనకదుర్గమ్మ ఆలయం ఎదుట 36 అడుగుల ఎత్తులో (పీఠంతో సహా) ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద శర్మ పేర్కొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు


టి.నరసాపురం మండలంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో సూర్యతేజ

టి.నరసాపురం: ఎన్నికల ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని పోలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. టి.నరసాపురం మండలంలో మంగళవారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు గడువు ఉందని, 85 ఏళ్లు నిండిన నడవలేని, లేవలేని వారికి పీడబ్ల్యూడీ ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏఈఆర్‌వో, బీఎల్‌ఓల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. వివాదాస్పద పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సుభాష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంఈవో టి.రామ్మూర్తి, ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై సిబ్బందికి శిక్షణ


బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొయ్యలగూడెం: వేసవిలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, వడదెబ్బకు గురైన వారికి చేయాల్సిన సపర్యలపై శిక్షణ తరగతులు మంగళవారం బయ్యనగూడెం పీహెచ్‌సీలో నిర్వహించారు. వైద్యాధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు, అపస్మారక స్థితికి గురైన వారికి అందించాల్సిన తక్షణ వైద్య చికిత్స విధానాలను వివరించారు. ముఖ్యంగా వృద్ధులు గర్భిణులు ఐదేళ్లలోపు చిన్నారుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు వివరించారు. ఇతర రక్షణ జాగ్రత్తలు సిబ్బందికి అవగాహన కల్పించి ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం


బుట్టాయగూడెంలో జీసీసీ సూపర్ మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ కుమార్

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఈఈ కేవీఎస్ఎస్ కుమార్ తెలిపారు. బుట్టాయగూడెంలో జీసీసీ ద్వారా ఏర్పాటు చేయనున్న గిరిజన సూపర్ బజార్, కాఫీ హౌస్ భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిరామన్నగూడెం, ముంజులూరు రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం వద్దకు వచ్చే పర్యాటకుల కోసం వాగులపై నిర్మించనున్న రోప్‌వే బ్రిడ్జిలు, మరుగుదొడ్లు, తదితర పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీఈ శీలం జొనాతన్, పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుబాటులో అరకు కాఫీ

పశ్చిమ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అరకు కాఫీని మరింత దగ్గర చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని జీసీసీ అకౌంటెంట్ సీహెచ్ రాజయోగి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ ఉగాది సందర్భంగా బుట్టాయగూడెంలోని జీసీసీ సూపర్‌బజార్, కాఫీ హౌస్ భవనంలో గిరిజన సహకార ఉత్పత్తులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా అరకు కాఫీ పొడిని అమ్మడమే కాకుండా కాఫీ కేంద్రాన్ని కూడా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. దీనిలో భాగంగానే భవనంలో మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని చెప్పారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కొయ్యలగూడెం: ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొయ్యలగూడెంకి చెందిన అపోలో స్కూల్ విద్యార్థులు స్థానం సంపాదించినట్లు అవార్డు పర్యవేక్షకులు జయ నాగేంద్రబాబు మంగళవారం పేర్కొన్నారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 3,333 మంది విద్యార్థులతో వరల్డ్ రికార్డ్స్‌లో భాగంగా అపోలో స్కూల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో 111 మంది అపోలో స్కూల్ విద్యార్థులు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమం జానపద కళాకారులు ఎల్ఆర్ కృష్ణబాబు పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. జయహో ధరణి జయహో నృత్య ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ప్రవీణ్‌కుమార్, ఛైర్‌పర్సన్ ఆర్.శ్రీవిద్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి


కొయ్యలగూడెంలో సార్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక గణేష్ సెంటర్లో నిర్వహించారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు హాజరయ్యారు. స్వతంత్ర్య సంగ్రామంలో సర్వాయి పాపన్న గౌడ్ నిర్వహించిన భూమిక స్ఫూర్తిదాయకమని, తర్వాత వచ్చిన సాయుధ సంగ్రామానికి ఆయన పోరాటం దిక్సూచిగా నిలిచిందని సత్తిపండు పేర్కొన్నారు. పాపన్న గౌడ్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గౌడ సంఘం కోరింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కానకాని గోకలే, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, ఏకుల గడ్డియ్య, మట్టా సత్యనారాయణ, కొనకళ్ళ రాము, శ్రీను, తొండ రాజు, చిటికెన తిలక్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

దెందులూరు: కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు కొవ్వలి జిల్లేడుదిబ్బ ప్రాంతంలో సాగునీటి అసౌకర్యంగా ఉన్న పంటల పొలాలను మంగళవారం వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా అధికారులతో కలిసి పరిశీలించారు. సమీప రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ జిల్లా అధికారులతో మాట్లాడి 48 గంటల్లో సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. కొవ్వలి ప్రాంతంలో పరిస్థితులను కలెక్టర్‌కు వివరిస్తామని అన్నారు. జాయింట్ డైరెక్టర్ వెంట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, దెందులూరు మండల వ్యవసాయ అధికారి గద్దె రమేష్, రైతులు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన


భీమడోలులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న మహిళా వైద్యులు కె.శ్రీలక్ష్మీ, జాహ్నవి

భీమడోలు: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా భీమడోలు సచివాలయం-1 వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి రోగులు పోటెత్తారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంటెంట్ డాక్టర్ ఎం.సునీతతో పాటు పలు విభాగాలకు చెందిన వైద్య బృందం రోగులను పరీక్షించారు. ఆరోగ్య సూత్రాలు, తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. ఈ సందర్భంగా భీమడోలు సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలకు సంబంధించి రోగులకు సునీత పరీక్షించి వారికి ఉచితంగా మందులను అందించారు. జనరల్ విభాగపు వైద్యులు కె.శ్రీలక్ష్మీ, ఆర్.జాహ్నవి, ఎముకలకు సంబంధించిన వైద్యులు సీహెచ్ సుధాకర్ పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఓ వెంకటరెడ్డి కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 415 మంది హాజరు కాగా వారికి వివిధ పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు 6 మందికి కంటి పరీక్షలు చేసారు. రక్తపరీక్షలు, ఇతర పరీక్షలు, ఈసీజీలు చేశారు. ఉచితంగా మందులను అందించారు. ఆపరేషన్ల కోసం నలుగురిని రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సోమశేఖర్

ఏలూరు రూరల్ : రివాల్వింగ్ ఫండ్స్‌తో పాఠశాలల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు రూరల్, అర్బన్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల ఆటస్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీల నిర్వహణ, పిల్లలు ఉపయోగిస్తున్న ట్యాబ్స్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాబోయే ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణ, మార్కులు ఆన్‌లైన్ చేయడంపై శ్రద్ధ వహించాలని ఎంఈఓ ఆర్ రంగయ్య సూచించారు. ఎంపీడీఓ బి.ప్రణవి అధ్యక్షతన నిర్వహించి ఈ సమావేశంలో ఎంఈఓ-1 రవిప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయుధ దళాల కవాతు

ఉంగుటూరు: మండంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ దళాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. చేబ్రోలు పోలీసుల ఆధ్వర్యంలో సమస్యాత్మక పోలింగ్ గ్రామాలైన కాకర్లమూడి, బొమ్మిడి, ఉప్పాకపాడు, నీలాద్రిపురం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు భరోసా కల్పించారు.